


"తెనాలి రామకృష్ణ" : సమీక్ష

జనవరి 21 సాయంకాలం బి. ఎన్. రంగాగారి కొత్త స్టూడియో ఆవరణలో విక్రమ్ ప్రొడక్షన్స్ వారి "తెనాలి రామకృష్ణ" ప్రెస్ షో జరిగింది. ఈ చిత్రం జనవరి 12 నుంచీ ఆంధ్రలో అనేక కేంద్రాలలో విజయవంతంగా నడుస్తున్నది. ఈ చిత్రం తమిళంలో కూడా తయారయింది. దాన్ని ఫిబ్రవరి ఆరంభంలో విడుదల చేస్తారు.

ఈ "తెనాలి రామకృష్ణ" అనే పేరుతోనే పూర్వం హెచ్. ఎం. రెడ్డిగారు ఒక "ఫార్సు" తయారు చేశారు. అది పామర ప్రేక్షకులను అప్పట్లో బాగా ఆకర్షించింది. ఆ మార్గం పూర్తిగా విసర్జించి, రామకృష్ణుణ్ణి ఒక కవిగా చిత్రిస్తూ, ఉదాత్తమైన కథతో, ఉత్తమ తరగతి చిత్రం తీయటానికి పూనుకున్న రంగాగారు ఎంతైనా అభినందనీయులు.

మెచ్చుకోదగిన మరొక విషయం ఏమిటంటే— బి. ఎన్. రంగా చాలా చిన్నతనంలోనే సినిమారంగంలో ప్రవేశించి టెక్నీషియన్‌గా— కామెరామాన్‌గా— పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్నవాడు తరవాత ఆయన "విక్రం లెబొరేటరీస్" స్థాపించుకున్నాడు. ఆటు తరవాత చిత్ర నిర్మాణంలో ప్రవేశించి, తానే నిర్మాతా, దర్శకుడూ, కామెరామాన్‌గా ఉండి, "మా గోపి" అనే "కాపీ" చిత్రం తెలుగులో తయారుచేసి విజయం సాధించాడు. తరవాత అదే చిత్రాన్ని తమిళంలోకి "డబ్" చేసి విడుదల చేశాడు. "మా గోపి"తో నిర్మాతగా కాలు నిలువదొక్కుకున్నాక రంగా మరొక కాపీ చిత్రమే తీయక, ముందడుగువేసి "[illegible]న్" చిత్రం రెండు భాషలలో ప్రారంభించాడు. అదే "తెనాలి రామకృష్ణ."

ఇది ఏవిధంగానూ చౌకచిత్రం కాదు. ఉత్తమ నిర్మాణానికి అవసరమైన హంగులన్నీ ఈ చిత్రంలో ఉన్నాయి. ఇందులో నాగేశ్వరరావు, రామారావు, నాగయ్య, ముక్కామల, భానుమతి, జమున, సురభి బాలసరస్వతి మొదలైన ప్రసిద్ధనటులున్నారు. బోలెడంత సంగీతం—10 పాటలూ, 1[illegible] పద్యాలూ—ఉంది. మంచిమంచి సెట్టింగులున్నాయి. ఇది "ఖరీదు" అయిన చిత్రం. ఈ చిత్రం పూర్తికాక పూర్వమే రంగా సొంత స్టూడియో నిర్మాణం ప్రారంభించాడు. ముందుగా రికార్డింగ్-ప్రొజెక్షన్ థియేటరు తయారయింది. "తెనాలిరామకృష్ణ" రికార్డింగంతా ఈ కొత్త థియేటర్‌లోనే జరిగిందట. ఒక ఫ్లోర్, లాబ్, ఇతర కట్టడాలూ నిర్మాణంలో ఉన్నాయి. రంగా ఈ విధంగా, టెక్నీషియనునుంచి నిర్మాతా, స్టూడియోదారు కావటమే గాకుండా చౌకచిత్రాల నుంచి ఉత్తమ తరగతి చిత్రాలకు పోయి అభివృద్ధి ప్రదర్శించటం ప్రశంసనీయమైన విషయం. ఈయన ఈసారి తీయ సంకల్పించిన చిత్రం "ఛత్రపతి శివాజీ" కూడా ఈ విషయాన్ని బలపరుస్తోంది.

"తెనాలిరామకృష్ణ"లో కొన్ని జానపద గాథలూ, పుక్కిటి పురాణాలూ, చరిత్రా, కల్పనా సమ్మిళితం చేయబడింది. ఈ పాత కొత్తల సమ్మేళనం కళాదర్శకత్వంలో, సంగీతంలో, నృత్యాలలో, ఇంకా అనేక అంశాలలో గోచరిస్తుంది. కథానాయకుడు రామకృష్ణుడు కవిగా, చాటువుల

కర్తగా, రాజకీయ చైతన్యమూ, ప్రభుభక్తీ కల వాడుగా, హాస్యగాడైన వికటకవిగా కూడా చిత్రించబడ్డాడు. రామకృష్ణుడే గాక, కృష్ణదేవ రాయలూ, అల్లసాని పెద్దన్నా, ముక్కు తిమ్మన్నా తాతాచార్యులూ, తిరుమలాంబా మొదలైన పాత్రలన్నీ నిండుగా చిత్రించబడ్డాయి. హాస్యం కోసం ఏ పాత్రగాని వెకిలిగా సృష్టించబడలేదు. కొన్నికొన్ని సంఘటనలు సందర్భం మార్చి చిత్రించ బడ్డాయి. ఉదాహరణకు, 17 ఏనుగులను ముగ్గురు అన్నదమ్ములకు తెలివిగా పంచినవాడు అప్పాజీ అని పుక్కిటి పురాణం. అయితే ఈ సంఘటన రామకృష్ణుడికి ఆపాదించబడింది. ఇటువంటి మార్పులు చిత్రంయొక్క రక్తికి ఏమాత్రం అడ్డురావు.

సాధారణంగా నిర్మాతలు తాము చిత్రం తీసేటప్పుడు ప్రేక్షకుల "తక్కువ" అభిరుచులను గురించి చాలా భయపడతారు. (వారి భయాలకు అప్పుడప్పుడూ ప్రేక్షకులు సాక్ష్యం యిస్తూంటారు కూడానూ!) ఆటువంటి సందర్భంలో, ఈ చిత్రంలో ఉత్తమ సాహిత్యానికి చెందిన పద్యాలనే గాక, కవితాగోష్ఠినికూడా ఎంతో సాహసంతో ప్రవేశ పెట్టి, ప్రేక్షకుల రసికత్వంలో నిర్మాతకు గల విశ్వాసాన్ని వ్యక్తపరిచారు. ఇది అభినందించ దగిన విషయం.

కృష్ణదేవరాయల ఆస్థానంలో అష్టదిగ్గజాలూ, కవితా గోష్ఠులూ ముందుంచుకుని, బహమనీ నవాబుల కుట్రలతో కూడిన రాజకీయాలతో నాటకం నడిచింది. ఈ నాటకంలోని పాత్రలుగా ముందు కనకరాజు అనే దేశద్రోహీ, తరవాత కృష్ణసానీ నాటకాన్ని నడిపిస్తారు. ఈ కుట్రలను భేదించి కృష్ణదేవరాయలకు విజయం చేకూర్చే పాత్రను రామకృష్ణ కవి నిర్వహిస్తాడు.

పండితులకు నచ్చేవీ, పామరులకు నచ్చేవీ అయిన సన్నివేశాలు చిత్రంనిండా కుప్పతెప్పలుగా ఉన్నాయి. చిత్రంలో నవరసాలకూ స్థానం కల్పించారు. నటనకు చక్కని అవకాశాలు ఉన్నాయి. చిత్రంనిండా అన్ని పాటలూ, పద్యాలూ ఉన్నప్పటికీ ఒక్కటికూడా సందర్భశుద్ధి లేకుండా లేదు. ప్రేక్షకుడి ఆసక్తి ఎక్కడా, ఏ సందర్భంవల్లకూడా తగ్గదు. మొదటినుంచి చివరిదాకా చిత్రం ఒకే వేగంతో నడుస్తుంది.

పాటలు రక్తిగా ఉండటానికి కారణం సరి అయిన సన్నివేశాలు మాత్రమే కాదు; చిత్రంలోని సంగీతం చాలా చక్కగా ఉంది. పాటల ట్యూనులు ఎన్నిసార్లు విన్నా విసుగెత్తదు. దానికి తోడు ఆర్. బాలసరస్వతీ, ఘంటసాలా, లీలా, కమలా మొదలైనవారు పాటలను చాలా చక్కగా పాడారు. భానుమతి స్వయాన పాడిన పాటలే ఒకమాదిరిగా ఉన్నాయనిపించాయి. చిత్రంలో నేపథ్యసంగీతం కూడా చాలా బాగుంది—కొన్ని ఘట్టాలలో అద్భుతంగా కూడా ఉంది.

నటులలో అగ్రస్థానం అవలీలగా నాగేశ్వరరావుది. రామకృష్ణకవికి అవసరమైన వేషభాషలు నాగేశ్వరరావుకు చక్కగా అమరాయి. అతను తాను నిర్వహించే పాత్రను బాగా అర్థం చేసుకోవటమేగాక చాలా సులభంగా ఆ పాత్రను చిత్రించ గలిగాడు. లోగడ చిత్రాలన్నిటికన్నా ఈ చిత్రంలో నాగేశ్వరరావు వాచికం బాగా పదునెక్కినట్టు కనిపిస్తుంది. ఆయా ఘట్టాలు రక్తి కట్టించటానికి అనుగుణంగా అతను వాచికాన్ని అవలంబించి విజయం సాధించగలిగాడు. తాతాచార్యులు పాత్ర నిర్వహించటంలో ముక్కామలా, అప్పాజీ పాత్ర నిర్వహించటంలో నాగయ్యాకూడా ఇదే విధమైన సౌలభ్యాన్ని ప్రదర్శించగలిగారు.

కృష్ణదేవరాయలుగా ఎన్ టి. రామారావు, కృష్ణసానిగా భానుమతీకూడా తమ పాత్రలతో చాలా సంఘర్షణ పడ్డట్టు కనిపిస్తుంది: వారా పాత్రలను అర్థం చేసుకోగలిగారనటానికి సందేహం లేదు. పాత్రలను చిత్రించటంలో ఎంతో శ్రమపడటంకూడా మనకు కనిపిస్తుంది. కానివారు తీసుకున్న శ్రమకు పదహారణాల ఫలితం దక్కినట్టు కనబడదు. నటుడికీ పాత్రకూ ఎప్పుడూ సంఘర్షణ ఉంటుంది. అది ప్రతి నటుడూ ఎరిగిన విషయమే. అయితే పాత్ర నటుడికి పూర్తిగా లొంగి రానప్పుడే ఈ సంఘర్షణ ప్రేక్షకుడు గమనించ గలుగుతాడు. ప్రత్యేకించి భానుమతికి కృష్ణసాని పాత్ర కొన్ని చోట్ల ఏమాత్రమూ లొంగినట్టు కనబడదు. ఇది నిజంగా ఆశ్చర్యకరమైన విషయమే. ఎందుచేత నంటే అది భానుమతి అతి విజయవంతంగా నిర్వహించగల,

నిర్వహించదగిన, పాత్ర. కొంత లోపం పాత్ర రచనలోనే ఉన్నదే మోననుకోవాలి.

రాణీ తిరుమలాంబగా సంధ్యా, రామకృష్ణుడి భార్యగా జమునా, రాధాసానిగా సురభి బాలసరస్వతీ. తాతాచార్ల శిష్యుడుగా వంగరా, కనకరాజుగా మిక్కిలినేనీ మొదలైనవారంతా తమ పాత్రలను చక్కగా నిర్వహించారు.

ఫొటోగ్రఫీ, ఎడిటింగు, దర్శకత్వమూ చాలా బాగున్నాయి. నిర్మాతగానేగాక, దర్శకత్వంలో కూడా బి. ఎస్. రంగా ఉత్తమ కళాకారుడి లక్షణం ఒకటి వ్యక్తం చేసుకున్నాడు. అదేమంటే కళావస్తువులో తన వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించటం; కళకూ, కళాకారుడికీ ఒక గాఢమైన సంబంధం ఉంటుంది. ఆ సంబంధాన్ని పురస్కరించుకునే అతను సమాజంతో చెయ్యి కలుపుతాడు. దానిద్వారానే తన సంస్కృతినికూడా వ్యక్తం చేస్తాడు. కేవలం వ్యాపార దృష్టితో తీసిన చిత్రాలలోనూ, ప్రేక్షకుల అభిరుచులను కొలిచి 'ఫార్ములా' ప్రకారం తీసిన చిత్రాలలోనూ దర్శకుడి సాంఘిక, సాంస్కృతిక స్వరూపాలు వ్యక్తం కావు. ఈ లోపం "తెనాలి రామకృష్ణ"లో అంతగా కనిపించదు.

సముద్రాల రాఘవాచార్యులుగారి రచనను గురించి రెండు మాటలు చెప్పకుండా ఈ సమీక్ష పూర్తి కాదు. ఇటువంటి చిత్రానికి రచన చెయ్యటం తేలికైన పనికాదు. సాహిత్యంతో అపారమైన పరిచయమూ, ప్రాచీన పాత్రలను భావన చెయ్యగల శక్తి, ఒక్క వాక్యంతో గత సంస్కృతిని స్ఫురింపజేసే సామర్థ్యమూ, సన్నివేశాల వైవిధ్యంతో అనేక రకాల రసాలను పోషించగల సమర్థతా సముద్రాలవారు ఈ చిత్రంలో ప్రదర్శించారు. ఈ చిత్రంయొక్క విజయంలో ఆయనకు గల పాలు అనల్పమైనది.

• • •

గడచిన ఏడాదిలో ఒకవైపు చిత్రాలకు డబ్బు బాగా వచ్చినా, రెండోవైపు నిర్మాతలు తమ చిత్రాలు దెబ్బతినకుండా ఉండటానికి చాలా జాగ్రత్తలు తీసుకున్నారు. వారు తీసుకున్న జాగ్రత్తలలో ఒకటి, ఇతర భాషలలో విజయవంతంగా నడిచిన చిత్రాలనే తీయటం; మరొకటి, పేరు ప్రఖ్యాతులుగల నటీనటులనే బుక్ చెయ్యటం. వీటన్నిటినీ మించిన జాగ్రత్త ఏమిటంటే నిర్మాణం ఖర్చు సాధ్యమైనంత తక్కువలో ఉంచటం.

దక్షిణదేశంలో సినిమా పరిశ్రమ ఆర్థికంగా దెబ్బతింటున్న రోజుల్లో, జెమినీ వాసన్ మొదలైనవారు వినోదపుపన్ను తగ్గింపు కోసం తీవ్రంగా ఆందోళన చేస్తున్న కాలంలో, సినీ టెక్నీషియనులు —ప్రత్యేకించి కె రామనాథ్—చిత్ర నిర్మాణంలో దుర్వ్యయం చాలా ఉంటున్నదనీ, అది తగ్గితే చిత్రాలు దెబ్బతినవలసిన అవసరం లేదనీ బల్లగుద్ది వాదించారు. ఈ వాదన అప్పట్లో నిర్మాతలకు నచ్చలేదు. "ఇది దుర్వ్యయం అని పైవాళ్లు ఎట్లా చెప్పగలరు? ఏ నిర్మాతా కావాలని, బుద్ధిపూర్వకంగా ఒక్కదమ్మిడీకూడా వృథా ఖర్చు చేయడు. మీకు దుర్వ్యయంగా కనబడేది నిర్మాత దృష్టిలో అవసరమైన ఖర్చే!" అన్నారు వారు.

వాగ్వాదానికైతే ఇదంతా చాలా బాగుంది గాని, నిర్మాతలు తెలివితక్కువచేతా, కొన్ని సులువులు గ్రహించకపోవటంచేతా దుర్వ్యయం చెయ్యటానికి ఈ వాదనలేవీ అడ్డంరాలేదు. 1954 నుంచీ ఈ దుర్వ్యయం క్రమంగా తగ్గుతూ వస్తున్నది. ఇప్పటికైనా దుర్వ్యయం లేదనలేంగాని, అతి సాధారణ చిత్రానికికూడా ఆరేసి లక్షలు ఖర్చు చేసే రోజులు ముందుండవని చెప్పవచ్చు.

నిజానికి చిత్రనిర్మాణంలో పెద్దఖర్చు నటులకు సంబంధించినది. పేరుబడ్డ నటులకు ఎక్కువ ఇవ్వాలి. కాని అందులో నష్టం ఉండదు. ఎందుకంటే అనామకులను తీసుకున్నదానికీ, పేరుపడ్డ వారిని తీసుకున్నదానికీ ఉండే తేడా చిత్రంమీద రాబడిలో అనేకరెట్లుగా కనిపిస్తుంది. అందుచేత పేరుబడ్డ నటులకిచ్చేది దుర్వ్యయమని ఏ నిర్మాతా భావించడు. పోతే ఈ పెద్దనటులద్వారా దుర్వ్యయం ఎందుకు జరుగుతుందంటే, వీరు అనేక చిత్రాలలో ఒకేసారి పనిచేస్తూ ఏ చిత్రం షూటింగుకూ సరిగా హాజరు కాలేరు గనక.

ఇది నిజంగా పెద్దచిక్కే. ఎందుకంటే, మిగిలిన ఖర్చులన్నీ సమంగానే ఉన్నా తీయటానికి ఎక్కువ కాలం పట్టిన చిత్రానికి ఎక్కువ ఖర్చవుతుంది. పేరుపడ్డ నటులను చిత్రాలలో వినియోగిస్తూనే

నిర్మాతలు ఈ రకమైన ఖర్చును సాధ్యమైనంత వరకూ తగ్గించే యత్నాలు చేశారు. దీనికిగాను వారు చాలా పద్ధతులు అవలంబించారు. అందులో ఒకటి డబుల్ కాల్‌షీట్స్ తీసుకోవటం; ఉదయం తొమ్మిదికి ప్రారంభించిన షూటింగు రాత్రి తొమ్మిదిదాకా జరకటం.

1955లో డబుల్ కాల్ షీట్స్ పరిపాటి అయాయి. నిజానికి అందులో చాలా సౌకర్యాలున్నాయి. వారం రోజుల్లోగాని పూర్తిగాని షూటింగు మూడు రోజుల్లో అయిపోతుంది. పెద్దనటులు ఎలాగూ రోజుకు రెండేసి కాల్‌షీట్సుకు పని చేస్తానే ఉన్నారు. రెండురకాల మేకప్‌తో రెండు పాత్రలు నటించేకన్న ఒకేపాత్ర నటన, మేకప్‌లో తేడాలేకుండా రెండు కాల్‌షీట్స్ చెయ్యటం వారికి చాలా సులువు. స్టూడియోవారి లెక్కన కూడా ఒకే సెట్టు ఫ్లోర్ మీద ఎంతోకాలం ఉండదు. డిస్ట్రిబ్యూటరు వైపునుంచి చిత్రం దబ్బున రంగు తేలుతుంది.

పెద్దనటులు కూడా నిర్మాతలతో సహకరించి వారికి ముందుగా కొన్ని కొన్ని రోజులు కేటాయిస్తున్నారు. ఒక నటిగాని, నటుడుగాని లభ్యం కాని రోజున నిర్మాత ఇతరులతో షూటింగు జరుపకోవచ్చు. ఇటువంటి ఏర్పాటు నిర్విఘ్నంగా కొనసాగటానికిగాను నిర్మాతలు అచ్చగా ఒక స్టూడియోకే అంటిపెట్టుకోక, వీలయిన చోటల్లా సెట్ వేసుకుంటున్నారు.

ఇటువంటి పద్ధతులు చిత్రనిర్మాణ వ్యయాన్ని తగ్గించి ఉంచటానికి తోడ్పడుతున్నాయి. నిర్మాణ వర్గం తాలూకు వ్యక్తులు ఆసక్తితో, సహకారంతో చురుకుగా పనిచెయ్యటం చిత్రాలకు అంతులేని లాభం చేకూర్చగలుగుతుంది. ఇక్కడే "పెద్ద" కంపెనీలకు లేని సౌకర్యం "చిన్న" కంపెనీలకు ఉంటున్నది. "పెద్ద" కంపెనీలలో ప్రతి తాఖీదూ "అడంగు"నుంచి రావాలి. కంపెనీ పెద్దదైన కొద్దీ అందులో పనిచేసేవాళ్ళు "చిన్న వాళ్ళు" అయి ఊరుకుంటారు. వారు చొరవగా పనిచెయ్యరు. చెప్పినది చేసి చేతులు కట్టుకు కూచుంటారు, చెప్పుదెబ్బ లేవైనా ఉంటే శిరసావహించి, ఎప్పటికప్పుడు మరింత "చిన్న" వాళ్ళయి పోతుంటారు. చిత్రం సృష్టించటంలో తమకుకూడా కొంత బాధ్యత ఉన్నదన్న "గర్వం" వారికి ఉండదు—ఉండే అవకాశమూ లేదు.

"చిన్న" కంపెనీలలో నిర్మాణంలో పాల్గొనే ప్రతి ఒకడూ తాను ఏ బాధ్యత నిర్వహిస్తున్నదీ, నిర్మాణానికి ఏవిధంగా తోడ్పడుతున్నదీ తెలిసి పనిచేస్తాడు. వాడికా పనిలో నిజమైన ఆనందం లభించే అవకాశం ఉంది. అందుకనే "చిన్న" కంపెనీలు తక్కువ ఖర్చుతో చిత్రాలు తీయగలుగుతున్నాయి, వాటిలోనే కొన్ని మంచి ఆర్థిక విజయంకూడా సంపాదించగలుగుతున్నాయి.

"సినిమా ఫీల్డులో మరీ పెద్ద కంపెనీలైనా ఉండాలి, చిన్న కంపెనీలైనా ఉండాలి. మధ్యరకం కంపెనీలకు ఇక రోజులు లేవు," అని ఒక ప్రసిద్ధ నిర్మాత రెండేళ్ళ క్రితం జోస్యం చెప్పారు. అయితే ఈనాడు మనం, "ఇకముందు చిన్న కంపెనీలవే రోజులు," అనుకోవచ్చు.

అంతమాత్రం చేత పెద్దకంపెనీలు దివాలా ఎత్తి పోవాలని కాదు. అవికూడా "చిన్న"కంపెనీలుగా పనిసాగించవచ్చు. ముఖ్యమైనది సౌలభ్యం. కథను ఎన్నుకోవటంలో, షూటింగు సాగించటంలో ప్రొడక్షన్ షెడ్యూల్ చేసుకోవటంలో సౌలభ్యానికి అగ్రస్థానం ఇవ్వాలి. "గొప్ప" చిత్రాలు తీసే పద్ధతులూ, మనస్తత్వమూ, దానివెంట ఉండే స్తనశల్య పరీక్షలూ, ప్రతిపాట్‌కూ తొమ్మిదేసి టేక్‌లూ—ఇలాటివన్నీ గిట్టుచాటు కానివే.

అయితే, చిత్రనిర్మాణ వ్యయంతగ్గి, ఆర్థికంగా చిత్రాలు దెబ్బతినటం, తగ్గిపోయినకొద్దీ ఇంకొక కొత్త సమస్య ఏర్పడుతుంది—తయారయే చిత్రాల సంఖ్య పెరుగుతుంది. అలా పెరగటంవల్ల పరిస్థితులు బాగున్నట్టు స్పష్టమవుతుందేగాని, అది మంచి పరిస్థితులకు దారితీస్తుందని ఎక్కడాలేదు. ఇవాళ చాలా చిత్రాలు నిర్మాణంలో ఉన్నాయి. ఇవి ఒకదానిమీద ఒకటివచ్చి పడితే అన్నిటికీ నష్టమే.

సాధారణ పరిస్థితులలో ఈ సీజనుకు పోటీ ఉండవలసింది. కాని ఈ సంక్రాంతికి విక్రమ్‌వారి "తెనాలి రామకృష్ణ" (విడుదల జనవరి 12) మాత్రమే బయటికి వచ్చింది. దానిమీద పోటీగా ఇంతవరకూ చిత్రంలేదు. కాని ఇకముందు ఒకదానొకటి తరుముకుంటూ రావచ్చు. ★